108లో ప్రసవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిన్నగోర గ్రామ పంచాయతీ పరిధి కొండవాని గోర గ్రామానికి చెందిన జెన్ని ఇందు శనివారం పురిటి నొప్పులు రావటంతో 108 వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. 108 వాహనం అక్కడికి చేరుకొని ప్రశవం కోసం వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు అధికం కావడంతో వాహనని పక్కకు తీసి ఈఎంటి శ్రీనివాసరావు చాకచక్యంగా ప్రశవం చేయడంతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి ఆమెకు మెరుగైన వైద్యం అందించారు. తల్లీ బిడ్డకు ఎటువంటి క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

ఫ్యామిలీ వైద్యం అంతంత మాత్రమే

మందులు, వైద్య పరీక్షలూ అరకొరే
మార్చి 1 నుంచి పథకం అమలు
ఈలోపు సమస్యలు పరిష్కారమయ్యేనా?

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రస్తుతం ట్రయల్ రన్ నడుస్తోంది. మార్చి 1వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రస్తుతం కేవలం విలేజ్ క్లీనిక్‌లకు మాత్రమే పరిమితమౌతుంది. ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తామన్న ప్రభుత్వ హామీ అరకొరగానే మంచాలపై మూలుగుతున్న రోగులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. మందులు, వైద్య పరీక్షలు కూడా అంతంతమాత్రంగానే అందుబాటులో ఉన్నాయి.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంటింటికీ వైద్యసేవల పేరిట సుమారు ఆరు నెలల క్రితం విలేజ్ క్లినిక్‌ల ట్రయల్‌రన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పిహెచ్ సిలకు వాటి పరిధిలోనున్న వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ లను అనుసంధానం చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పిహెచ్ సిలోగల ఇద్దరు వైద్యులు చెరో కొన్ని క్లీనిక్‌లకు బాధ్యత వహించాల్సి వుంటుంది. వైద్యులు రోజుకొకరు చొప్పున తమకు కేటాయించిన క్లీనిక్‌లో ఒకపూట, ఆ క్లీనిక్ పరిధిలోగల ఇంటినుంచి బయటకు రాలేని రోగుల ఆరోగ్య తనిఖీలు రెండోపూట నిర్వహించాలి. పిహెచ్‌సికి కేటాయించిన 104వాహనంలోనే ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో కలిసి చేరుకుంటారు. ఈ వాహనంలోనే మందులు, సుగర్, బిపి, హెచ్ఐవి, థైరాయిడ్ వంటి 17రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. వీరికి క్లీనిక్‌లో నియమించిన బిఎస్సీ నర్సింగ్ సిబ్బంది, సంబంధిత సచివాలయ ఎఎన్ఎం, స్థానిక ఆశా వర్కర్ సాయపడతారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1088 అధునాతన 104 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 46వేల మంది బిఎస్‌సి నర్సింగ్ స్టాఫ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లను నియమించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజని ప్రకటించారు. కానీ, ఆచరణలో చాలా చోట్ల ఈ సేవలు కేవలం విలేజ్ క్లీనిక్ లకే పరిమితమయ్యాయి. పిహెచ్‌సిలు, సచివాలయ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఫ్యామిలీ వైద్యం బాగానే అమలవుతున్నా మధుర గ్రామాల్లో సరిగా అందడం లేదు. బాడంగి మండలంలో మొత్తం 25పంచాయతీల పరిధిలో 32గ్రామాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఒకే ఒక్క వాడాడ పిహెచ్ ఆధారం. దీంతో, వైద్య బృందాలు కేవలం విలేజ్ క్లీనిక్ కేంద్రాలుగావున్న 18 గ్రామాల్లో మాత్రమే సేవలందిస్తున్నాయి. ఈ మండలంలోని పూడివలస, పింద్రింగివలస, చినవాడాడ, మల్లంపేట, అచ్చియ్యపేట, లక్ష్మీపురం, హరిజన పాల్తేరు గ్రామాలకు చెందిన రోగులు సంబంధిత విలేజ్ క్లీనిక్‌కి వెళ్లాలంటే కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి వుంటుంది. ఈనేపథ్యంలో ఇటువంటి చోట్ల ఇంటింటికీ వైద్య సేవల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాల్సివుంది. లేదంటే ఎప్పటి మాదిరిగానే ఆర్ఎంపిలను ఆశ్రయించక తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పూడివలసకు చెందిన రెడ్డి తవిటినాయుడు, ఆయన భార్య సుగర్, బిపి, థైరాయిడ్ వంటి రోగాలతో బాధపడుతున్నారు. మందులు అప్పుడప్పుడు మాత్రమే అందుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం బియ్యాలవలస విలేజ్ క్లీనిక్ కేంద్రంలో మినహా దానిపధిలోని దురిబిలి, పెళ్లివలస, మంత్రజోల సహా తొమ్మిది గిరిజన గ్రామాలకు ఇప్పటికీ వైద్య బృందాలు సరిగా వెళ్లడం లేదు. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇంటింటికీ వైద్యం సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మరోవైపు క్లీనిక్ భవనాలు కూడా పూర్తి కాకపోవడంతో పరాయి పంచల్లోనూ, ఆ అవకాశమూ లేని చోట ఆరు బయట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మందులు, వైద్యపరీక్షలకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతోపాటు అందుకనుగుణంగా వైద్యులు, ఇతర సిబ్బందిని సన్నద్ధం చేయాల్సి ఉంది.

ఆడలి వ్యూ పాయింట్ నిర్మాణానికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

ఆడలి వ్యూ పాయింట్ పనులు ప్రారంభించి, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శనివారం మండలానికి వచ్చిన ఆయన వ్యూ పాయింట్ డిజైన్ ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యూ పాయింట్ చాలా బాగుందని, పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం స్థానికంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం జీడి ప్రొసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పిఒ బి.నవ్య, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపిడిఒ కె.గీతాంజలి, కార్యదర్శి సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్

ఎపిజెఎసి జిల్లా శాఖ అధ్యక్షులుగా శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులుగా జి.శ్రీరామ్మూర్తి ఎన్నికయ్యారు. ఎపి జెఎసి అమరావతి సంఘం కింద పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా శాఖల ఎన్నికలు రాష్ట్ర జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లా శాఖ అధ్యక్షులుగా కలెక్టర్ కార్యాలయంలో జి-విభాగం పర్యవేక్షకులు జి.శ్రీరామ్మూర్తి, అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు (ఆర్‌టిసి), ఉప అధ్యక్షులుగా జి.చంద్రమౌళి (పంచాయతీరాజ్), టి.నాగేశ్వరరావు (ప్రధాన ఉపాధ్యాయులు), ఆర్.రమణమూర్తి (సహకార శాఖ), కె.భవాని (ఎఎన్ఎం), ప్రధాన కార్యదర్శిగా డిజి ప్రసాదరావు, కార్యదర్శులుగా వి.గౌరినాయుడు, ఎ.అశోక్, కోశాధికారి టి.విరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల శ్రీరామ్మూర్తి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎపి జెఎసి నూతన కార్యవర్గం

6న ఐసిడిఎస్ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిబ్రవరి 6న ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయం ముట్టడి కార్యక్రమం జరగనుందని, ఇందులో అంగన్‌వాడీలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరళ కుమారి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిబ్బందికి యూనియన్ నాయకులతో కలిసి ముందస్తుగా సమాచార పత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీలు అనేక సేవలు అందిస్తున్నారని, కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని అన్నారు. విద్యుత్ సౌకర్యం లేదని, విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదని అన్నారు. టిఎ, డిఎలు గత ఐదేళ్లలో ప్రభుత్వం చెల్లించడంలేదని అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుంచి బిల్లులు చెల్లించలేదని, దీనివల్ల అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండిపెడుతున్నారని అన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు తప్ప వేతనాలు పెంచలేదన్నారు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, అయితే గ్రామాల్లో నెట్ సౌకర్యం లేకపోవడంతో ఫోన్లు పనిచేయడంలేదన్నారు. తనిఖీల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో వీరు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలౌతున్నారు. కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి, అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఫిబ్రవరి 6న జరిగే ధర్నాలో అంగన్‌వాడీలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సిబ్బందికి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు

మహిళా సాధికారతపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

ఉమెన్ ఎంపవర్మెంట్ అనే అంశంపై స్థానిక జెఎన్‌టియు కాలేజీలో శనివారం వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమానికి హాజరైన డాకర్ ఎం.మృత్యుంజయరావు మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తించగలిగితే ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. ఎక్కువ మందిలో కేన్సర్‌ను చివరి దశలో గుర్తించడంవలన ప్రాణ హాని ఎక్కువగా ఉంటోందన్నారు. కేన్సర్ లోని రకాలు, అవి ఏ రకంగా రావడానికి అవకాశం ఉందో మరియు వాటిని ప్రాథమికంగా ఎలా గుర్తించాలి అనే అంశాలపై వివరించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం, పండ్లు, ప్రతీరోజు 3-4లీటర్ల మంచినీరు తీసుకోవాలన్నారు. హెచ్‌పివి అనే వాక్సిన్‌ను వేసుకోవడం ద్వారా భవిషత్తులో కేన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి.నళిని మాట్లాడుతూ ప్రతీ మహిళా ఆరోగ్యవంతంగా, శక్తి వంతంగా ఉంటేనే వారి కుటుంబం, సమాజం కూడా బాగుంటుందన్నారు. ప్రతీ రంగంలో కూడా మహిళలు రాణించాలన్నారు. ప్రతీ మహిళా ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత అండ్ గ్రీవెన్సు సెల్ డైరెక్టర్ డాక్టర్ జి.జయసుమ, డాక్టర్ డి రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా విద్యార్థులకు మంచి భవిష్యత్తు

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాలిటెక్నిక్ డిప్లమా చేసిన వారికి మంచి అవకాశాలున్నాయని, భవిష్యత్ వారిదేనని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు సి.నాగరాణి అన్నారు. స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో పాలిటెక్నిక్ విద్య ప్రాముఖ్యతపై డైరెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఇఒలు, జెడ్‌పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 84 ప్రభుత్వ, 175 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని, అయితే విద్యార్థుల్లో అవగాహన లేక డిప్లొమాలో చేరికలు తక్కువగా ఉంటుందన్నారు. దాన్ని మెరుగుపర్చాలని, అందుకు అందరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. డిప్లొమా చదివిన విద్యార్థులకు రాష్ట్రంలోనూ, దేశ, విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నికల్ చదివిన విద్యార్థులు విశాఖపట్నం తదితర ముఖ్య నగరాల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో ఏషియన్ పెయింట్స్, టాటా, హెచ్‌సిఎల్ తదితర పలు కార్పొరేట్ సంస్థల్లో ఏడాదికి రూ.5 నుంచి 8 లక్షల జీతం సంపాదిస్తున్నారని చెప్పారు. డిప్లొమా చదివిన విద్యార్థులకు నైపుణ్యం ఎక్కువగా ఉంటుందని, జాతీయ స్థాయిలో ఎన్ఐటి, ఐఐటి వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో మంచి ర్యాంకులు సాధించిన వారు ఎక్కువగా ఉంటారని తెలిపారు. అంతేకాక వివిధ కార్పొరేట్, ప్రభుత్వ రంగాల్లో అధిక శాతం డిప్లొమా విద్యార్థులు ఉంటారని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు మంచి నైపుణ్యం కలిగినవారు ఉంటారని, జాతీయ స్థాయిలో ఉన్న మెరుగైన కళాశాలల నుంచి వస్తారని ఆమె చెప్పారు. పాలిటెక్నిక్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైఉందని ఆమె తెలిపారు. డిప్లొమో కళాశాలల్లో మంచి వాతావరణం, ఆహార భద్రత, పునాది ఉంటుందని వివరించారు. డిప్లొమా ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు ప్రచారం విస్తృతంగా చేయాలనికోరారు. డిప్లొమా చేసే విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు సమష్టిగా బాధ్యతగా తీసుకొని అవసరమైతే పాఠశాలల్లో కోచింగ్ ఇచ్చి మంచి ఉపాధి అవకాశాలు గల డిప్లొమా కోర్సుల్లో విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో కోచింగ్ ఏర్పాటుకు ఆలోచించాలన్నారు. టెన్త్ తర్వాత మంచి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. డిప్లొమో కోర్సుల్లో ముఖ్యంగా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రోసెసింగ్, మెరైన్, టెక్స్‌టైల్ తదితర కోర్సులు ఉన్నాయని, వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు.

ఎంఇఒలు మాట్లాడుతూ పాలిటెక్నికల్ నోటిఫికేషన్ పెద్దగా ఎవరికీ తెలియడం లేదని, దీనికి విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. పల్లె వాతావరణం నుంచి వచ్చే విద్యార్థులకు ఆన్ లైన్‌లో దరఖాస్తుపై అవగాహన ఉండదని, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దరఖాస్తు చేయలేరని తెలిపారు. కళాశాలల నుంచి కొంత సహాయ సహకారాలు కల్పిస్తే డిప్లమో కోర్సుకు పూర్వ వైభవం వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరన్, గుమ్మలక్ష్మీపురం పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ టి. జగదీష్‌బాబు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ నాగరాణి, పక్కన ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

పీకల్లోతు గోతులు
ప్రజల ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రావెల్ కోసం అక్రమార్కులు చెరువులను ఇష్టానుసారంగా తవ్వేయడంతో పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడుతున్నాయి. ఈ గొయ్యిల్లో నీరు చేరడంతో అది గమనించని ప్రజలు, పశువులు అందులోపడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో చెరువుల్లో దిగాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చెరువుల్లో అక్రమ తవ్వకాలకు అడ్డకట్ట వేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

మండలంలోని మిర్తివలసకు శ్రీను అనే పండ్ల వ్యాపారికి చెందిన ఇద్దరు పిల్లలు ఇటీవల ఆ గ్రామ సమీపంలో ఉన్న చెరువులోని గొయ్యిలో పడి మృత్యువాపడ్డారు. దీనికి కారణం ఆ చెరువులో గ్రావెల్ కోసం తీసిన పెద్దపెద్ద గొయ్యి. ఈ గొయ్యిల్లో ఆటలాడుకుంటున్న పిల్లలు అందులో జారిపడి అక్కడికక్కడే మరణించిన సంఘటన నుంచి ఆ కుటుంబ ఇంకా కోలుకోలేని పరిస్థితికి తీసుకువచ్చింది. ఇదే పరిస్థితి మండలంలోని పలగరతో పాటు పలు గ్రామాల్లోనే నెలకొనే పరిస్థితి ఏర్పడనుంది. ఈ గ్రామసమీపానున్న కుమ్మరి బందను కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ అనుమతుల్లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వుకుపోతున్నారు. దీంతో చెరువు అంతా 5 నుంచి 6 అడుగుల లోతు గుమ్ములు ఏర్పడ్డాయి. ఈ చెరువుకు సమీపంలో దళితవాడ ఉంది. ఈ కాలనీకి చెందిన మహిళలు, పిల్లలు, వృద్ధులు కాలకృత్యాల కోసం ఇదే చెరువుకు వెళ్తున్నారు. వర్షా కాలంలో ఈ గొయ్యిల్లో నీరు చేరితే ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అనేక పంచాయతీలో పరిధిలోని చెరువుల్లో కంకర కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో మరింత రెచ్చిపోతున్నారు.

మండలంలోని పలగర రెవెన్యూ పరిధిలో గల కుమ్మరి బంద చెరువు భూగర్భాన్ని జెసిబితో అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. విఆర్ఒ, తహశీల్దార్ అనుమతులేవీ లేకుండా కేవలం రాజకీయ పలుకుబడితో జెసిబిలతో సుమారు ఐదు, ఆరు అడుగుల లోతులో చెరువు భూగర్భమంతా మట్టిని తవ్వి నాలుగు ట్రాక్టర్లతో సుమారు 40 ట్రాక్టర్ల లోడ్ల వరకు అక్రమంగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. ఈ విషయమై సిపిఎం మండల కార్యదర్శి యమ్మల మన్మధరావు డిప్యూటీ తహశీల్దార్ కె.రత్నకుమారి, విఆర్ఒ నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని తవ్వకాలను ఆపివేయాలని, లేకుంటే ప్రభుత్వ నిబంధనలను అనుసరించాల్సి వస్తుందని, జెసిబి, ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించడంతో వెంటనే తవ్వకాల ఆపివేశారు. అయితే అక్కడ పెద్ద పెద్ద గోతులతో చెరువు అంతా గోతులమయంగా మారిపోయింది.

అక్రమ తవ్వకాలను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

గోతులను పూడ్చాలి

గ్రావెల్ కోసం తీసిన గోతులను వెంటనే పూడ్చివేయాలి. లేని పక్షంలో అక్కడ నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి ప్రాణాపాయం కలిగిన సంబంధిత వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి. స్వప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అధికారులు అనుమతి లేకుండా, ఇష్టా రాజ్యంగా మండలంలోని చెరువుల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- వై.మన్మధరావు,
సిపిఎం మండల కార్యదర్శి

విద్యాశాఖలో బయటపడ్డ డొల్లతనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సాక్షాత్తు జిల్లా విద్యాశాఖ మంత్రి ఇలాకాలోనే ఆశాఖ పని తీరులో డొల్లతనం బయటపడం చర్చనీయాంశంగా మారింది. అనంతర పరిణామాలు కూడా తీగ లాగితే డొంక కదిలినట్టుగా కనిపిస్తున్నాయి. దీంతో, గడిచిన వారం రోజులుగా విద్యాశాఖ పనితీరు ముఖ్యంగా పనుల కేటాయింపుల్లో పర్యవేక్షణా లోపాలు, నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు వంటివి చోటు చేసుకున్నట్టుగా పబ్లిక్ టాక్. ఈనెల 20న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఉపాధ్యాయుల పనితీరులో లోపాలు మొదలుకుని, నిర్మాణ పనుల కేటాయింపులు, నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్టుగా ఆయన బయటపెట్టారు. ఇందుకు కారణమైన వారిని మందలింపులు, హెచ్చరింపులు కూడా చేశారు. అంతటితో ఆగలేదు. ఆర్‌జెడి, డిఇఒ, ఎపిసి సహా ఓ ఉపాధ్యాయుడికి, పలువురు ఇంజినీర్లుకు ఛార్జి మెమోలు కూడా ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారిని కూడా సుతిమెత్తగా మందలించారని బాహాటంగానే చర్చసాగుతోంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే... విద్యకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టుగా ప్రభుత్వం, అందులోనూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పదేపదే చెప్తున్నారు. విద్యాశాఖ మంత్రి కూడా మన జిల్లాకు చెందినవారే. ఈ నేపథ్యంలో విద్య ప్రమాణాల తీరు తెన్నులు, నాడు - నేడు పేరిట రూ.వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు మిగిలిన జిల్లాలతో పోలిస్తే కాస్త మెరుగుగానే ఉంటాయని ఎవరైనా ఊహించడంలో తప్పులేదు. కానీ, మేడి పండు చూడు మేలిమై ఉండు - పొట్ట విప్పిచూడు పురుగులుండు అన్నట్టుగా ఉత్తీర్ణతలో మెరుగైన స్థానాలు సాధిస్తున్నట్టు ఏటా చంకలు గుద్దుకుంటున్న మన జిల్లాలో అధికారుల పర్యవేక్షణ, బోధనా ప్రమాణాలు మొదలుకుని అడ్మినిస్ట్రేషన్, ఇంజినీరింగ్ పనుల కేటాయింపు, అమలులో ఎన్నో లోపాలు ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో వెలుగులోకి వచ్చాయి. దీన్ని గుణపాఠంగా తీసుకుని ముందుకు సాగాల్సిన ఉన్నతాధికారులు నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవహరిస్తే వ్యవస్థ మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంటుంది. సరిగ్గా అందుకు తగ్గట్టే ఛార్జి మెమోలు అందుకున్న అధికారులకే గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ప్రతిభా పురష్కారాలు అందజేశారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ప్రవీన్ ప్రకాష్ ఆదేశంతో మెమోలు పుచ్చుకున్న ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ లింగేశ్వరరెడ్డి ఇప్పుడిప్పుడే పురివిప్పుతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తమ స్థాయిలోనూ మెమోల పరంపర కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు పది మందికి మెమోలు జారీ చేశారు. ఇద్దరిని సస్పెండ్ చేశారు. అక్కడితో ఆగకుండా నా వరకూ వచ్చినప్పుడు నేనెందుకు ఉపేక్షించాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు ఛార్జీమెమోలు జారీ చేస్తూ, కొందరిని సస్పెండ్ కూడా చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులంతా డిఇఒ పేరు చెబితేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. బోధనా సామర్ధ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉపాధ్యాయుల పట్ల బెదిరింపులకు పాల్పడితే సామర్ధ్యాలు మరింత దిగజారే పరిస్థితి నెలకొంటుందని పలువురు హెచ్ఎంలు అంటున్నారు. ఎవరికి వారు మెమోలు జారీచేసుకుంటూ వెళ్లిపోతే విద్యాశాఖ పనితీరు మారిపోతుందా? అన్నది చాలా మంది ప్రశ్నిస్తున్నారు. 'పనితీరు మెగురుపడడానికి మెమోలు, సస్పెషన్లు వంటివి. కానీ, మెమోలు జారీచేసినంత మాత్రాన పనితీరు మెరుగుపడిపోయినట్టు కాదు సుమా..!' అంటూ చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఛార్జి మెమోల విషయంలో ప్రవీణ్ ప్రకాష్‌ను అనుకరించడం మానేసి, వ్యవస్థలో లోపాలను సరిచేయడానికి చిత్తశుద్ధి కనబరచాలని ప్రజాధృక్కోణం గలవారు అభిప్రాయపడుతున్నారు. కేవలం జిల్లా విద్యాశాఖ అధికారులే కాకుండా మొత్తం జిల్లాను నడిపించే కలెక్టర్ కూడా చొరవ చూపించాల్సి వుందని పబ్లిక్ టాక్. లేదంటే అటు ప్రభుత్వ ఆశయానికి, ఇటు విద్యార్థుల భవిష్యత్తుకు తూట్లు పొడిచినట్టేనని చర్చించుకుంటున్నారు.

సాయం కోసం విశ్వబ్రాహ్మణుల వినతి

సమస్యను వివరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్ : విశ్వబ్రాహ్మణుల జీవనోపాధికి ప్రభుత్వం నుండి సహాయం అందించేందుకు కృషి చేయాలని ఆ సంఘం సభ్యులు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌ను కోరారు. బంగారపు ఆభరణాల తయారీలో చేతి వృత్తిగా జీవనాధారం చేసుకొని బతుకుతున్న కొన్ని వందల విశ్వబ్రాహ్మణ కుటుంబాలు నేడు ఆభరణాల తయారీలో వస్తున్నటువంటి ఆధునిక పద్ధతుల వల్ల మనుగడ కష్టతరంగా ఉందని విన్నవించారు. ప్రసన్నకుమార్ స్పందిస్తూ ఈ ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారపు పని చేసే కులవృత్తి సంఘం పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా అమ్మితే జరిమానా

సాలూరురూరల్ : నాటు సారా ఎవరైనా అమ్మితేనా, ఎవరి వద్దనైనా నిల్వ ఉన్నా రూ.10వేలు జరిమానాతో పాటు పోలీసు కేసులు పెట్టనున్నట్టు మండలంలోని మరిపల్లి గ్రామస్తులు తీర్మానించుకున్నారు. ఈ మేరకు శనివారం గ్రామసభ నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు మాజీ సర్పంచ్ కె.పోలినాయుడు, కె.వెంకట రమణ, కె.సీతారాం, రాము తదితరులు విలేకరులకు తెలిపారు.

ఫోలిక్ యాసిడ్ సిరప్ తప్పనిసరి

సిరప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఐఒ

పార్వతీపురంటౌన్ : పిల్లల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను క్రమం తప్పకుండా వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. శనివారం ఆయన పట్టణంలో 22, 23 వార్డుల్లో అంగన్వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది చిన్నారులకు ఐరన్ సిరప్‌లు వేస్తున్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలకు వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా ఐరన్ సిరప్‌లను వేయాలని వైద్య, అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అలాగే పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి పోషకాహారలోపం, సరిగా శారీరక ఎదుగుదల లేని, బరువు తక్కువగా ఉన్న, రక్త హీనత గల పిల్లలను గుర్తిస్తే వెంటనే ఎన్ఆర్‌సి కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో ఐదేళ్లలోపు పిల్లలకు చెందిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని జగన్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.పుష్ప, జయగౌడ్, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

పాచిపెంట : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని సిఐటియు, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాచిపెంటలో సిఐటియు నాయకులు చింతపల్లి రాజు, చింత పోల్రాజు, కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సూకూరు అప్పలస్వామి, కె.కల్యాణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీ, ప్రత్యేక హోదా అమలు చేయాలని, పంచాయతీలకు సర్వాధికారాలు ఇవ్వాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విభజన హామీ అమలుపైనా, ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. జిఒ 1ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గృహ లబ్ధిదారులతో సమావేశం

మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి

సీతానగరం : మండలంలోని బల్లకృష్ణాపురంలో శనివారం జగనన్న హౌసింగ్ కాలనీ లబ్ధిదారులతో ఎంపిడిఒ బి.కృష్ణమహేష్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్మాణ పనులు, ఆర్థికపరమైన అంశాలుంటే వెలుగు ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇప్పిస్తామన్నారు. ప్రతి లబ్ధిదారుడు హౌసింగ్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ నడిమింటి సుశీల రామకృష్ణ, మాజీ సర్పంచ్ దాసరి సింహాచలం, హౌసింగ్ ఎఇ జానకీరాం, ఎపిఎం ఆర్.శ్రీరాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు పువ్వల లావణ్య

గుంజరాడలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి

కురుపాం : మండలంలోని ఉరిడి పంచాయతీ గుంజరాడలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నియోజకవర్గ నాయకులు పువ్వల లావణ్య, బిడ్డిక పద్మావతి, బిడ్డిక తమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్‌న ఆయకులు దత్తి లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. వైసిపి పాలనలో కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధిని టిడిపి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని, కావున రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేస్తూ, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

.జియ్యమ్మవలస : రథసప్తమి వేడుకలను గ్రామాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. సూర్యుడు ఆరాధన వల్ల ఆయురారోగ్యాలు కలుగుతాయన్న విశ్వాసంతో ప్రతి ఏటా రథసప్తమి వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. వేకువజామునే లేచి కుటుంబమంతా తలంటు స్నానాలు చేసి సూర్య భగవానున్ని స్మరించుకుంటూ పిల్లాపాపలతో రథసప్తమి వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు.

గిరిజనులకు తప్పని కాజ్‌వే కష్టాలు

● పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
● బిల్లుల చెల్లింపుల్లో జాప్యమే!

శిథిలావస్థలో ఉన్న తాళ్లబురిడి- ములగ కాజ్‌వే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురిడి, ములగ గ్రామాల మధ్య సాకిగెడ్డపై ఉన్న కాజ్‌వే గతంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోవడంతో ములగ, గంగాపురం, వెలగవలస, డోకిశిల పంచాయతీలకు చెందిన దాదాపు 30 గిరిజన గ్రామాలతో పాటు ఆంధ్రా-ఒడిషా సరిహద్దు ఒడిషాకు చెందిన పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. గెడ్డలో దిగి నడుచుకుంటూ వెళ్లడానికి పాదచారులు, ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి అవస్థలు గమనించిన స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి చొరవతో బల్లిరాజుపేట నుంచి వెలగవలస ఆర్‌అండ్‌బి రహదారి వరకూ రోడ్డు నిర్మాణంతో పాటు నూతనంగా కాజ్‌వే నిర్మాణానికి ఎఎంసి నిధులు రూ.126.85లక్షలు మంజూరు చేయించారు. టెండర్ కూడా ఖరారైంది. అయితే అధికారుల చిత్తశుద్ధి లోపమో, కాంట్రాక్టర్ అలసత్వమో గిరిజనులు చేసుకున్న పాపమో తెలియదు కానీ కాజ్‌వే నిర్మాణ పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో రహదారి కష్టాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆరాతీస్తే ఎఎంసి నిధులతో గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లింపుల్లో జరుగుతున్న తీవ్రమైన జాప్యం వల్ల ఈ తరహా పనుల ప్రారంభానికి కాంట్రాక్టర్లు అంతగా ఆసక్తి చూపకపోవడం కారణంగా చెపుతున్నారు. ఏదిఏమైనప్పటికీ ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్మాణ పనులు ప్రారంభించి ఈ వేసవిలో ముమ్మరంగా జరిగేలా చూడాలని, తద్వారా వర్షాకాలంలో ప్రతి ఏటా ఎదుర్కొనే రహదారి కష్టాలను తొలగించాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.


విద్యుత్ కాంతుల్లో మరియగిరి కొండ

30న మరియగిరి యాత్ర

వీరఘట్టం : మండలంలోని యు. వెంకంపేట పంచాయతీ పరిధి మరియగిరి కొండ వద్ద ఈనెల 30న మరియగిరి యాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ పుణ్యక్షేత్రానికి విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం విశాఖపట్నం జిల్లాల నుండి దైవ దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో రావడం ఆనవాయితీ అని చెప్పారు. ఇక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు పాలకొండ డిఎస్‌పి పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మరియగిరి యాత్ర పురస్కరించుకొని గత నాలుగు రోజుల నుండి కొండ వద్దకు భక్తులు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారన్నారు.

విద్యా సామర్థ్యాలపై దృష్టి: డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల విద్యాసామర్థ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డివి రమణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కంబరవలస ఉన్నత పాఠశాల, గాదిలంకలోనే ప్రత్యమ్నాయ పాఠశాలలు శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే విధంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి పరీక్షలు పెట్టి విద్యా ప్రమాణాలు మెరుగుపడే విధంగా చొరవ చూపాలన్నారు. పాఠశాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చూడాలన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పదో తరగతిలో ప్రతి విద్యార్థి అత్యంత మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా చూడాలన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న డిఇఒ రమణ

అనంతరం కంబర వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు ప్రత్యమ్నాయ పాఠశాలల సమన్వయకర్తలు శ్రీనివాస రావు, కిషోరు, ఎన్ మధు, కంబర వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. భాస్కరరావు, ఏ వెంకటరావు తదితరులు ఉన్నారు.

కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చే పిం కిసాన్, రైతు భరోసా నిధుల జమ ఫిబ్రవరి 10, 15తేదీల మధ్యలో జరిగే అవకాశం ఉన్నందున త్వరితగతిన రైతులకు ఇకెవైసి పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని నాందేడువలస, రాయిగుడ్డివలస రైతు భరోసా కేంద్రాలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ లబ్ధిదారులంతా త్వరితగతిన ఇకెవైసి పూర్తిచేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున సరైన మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే రైతుల నుంచి అన్ని రకాల చిరుధాన్యాలను కొనుగోలు చేస్తుందన్నారు. కావున రానున్న ఖరీఫ్ సీజన్లో చిరుధాన్యాలు సాగు పెంచాలని కోరారు. అంతేకాక ఈ సీజన్‌కు కావాల్సిన చిరుధాన్యాల విత్తనాల ప్రణాళికను మార్చి నెలాఖరకు సిద్ధం చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోముల లచ్చయ్య మాట్లాడుతూ రైతులంతా వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతరత్రా పనులను పక్కన పెట్టాలని వ్యవసాయశాఖ ఏప్రిల్‌లో విత్తనాలను అందిస్తే తప్పనిసరిగా సాగు విస్తీర్ణం పెంచుతామని తెలిపారు. అనంతరం పొగాకు పంటను పరిశీలిస్తూ పొగాకులో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, దీని నివారణకు ఇమిడా క్లోపరేడ్, అత్తరా, ఎసిటమిప్రిడ్ మందుల్లో ఒకదాన్ని పిచికారీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు సాయి గణేష్, అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

తెలుకలి కుటుంబాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గ పరిధిలో గల తెలుకలి కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని తెలుకలి సామాజికవర్గ రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్, రాష్ట్ర నాయకులు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో అన్నారు. తెలికుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సంకిస భవానిప్రియతో పాటు రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం సభ్యులు చేస్తున్న రాష్ట్ర పర్యటనలో భాగంగా మొట్ట మొదటిగా శనివారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా బలిజిపేటలో 10 సెంట్లు స్థలాన్ని తెలుకులి సంక్షేమ సంఘం సామాజిక భవన నిర్మాణానికి కేటాయించిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్చాలను అందచేసి శాలువాతో ఘనంగా సత్కరించి, రాష్ట్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గల తెలికుల కులస్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అందజేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తెలికుల కులస్తుల కుటుంబాలకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాండ్ల, తెలుకలి, దేవతెలుకలి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు ఉయ్యూరు నాని, చెవిటి వెంకటరమణారావు రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతం, రాష్ట్ర సమైక్య అధ్యక్షులు అడ్డా వీర వెంకటరాజు, జిల్లా అధ్యక్షులు రావుపల్లి రామయ్య మాస్టారు, జిటిఎస్ ప్రసాద్, కోశాధికారి కెల్ల శ్రీనివాసరావు, పార్వతీపురం పట్టణ తెలుకలి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిని అందిస్తున్న నాయకులు

పభుత్వం దృష్టికి గాండ్ల తెలికుల సమస్యలు

సాలూరు : రాష్ట్రం లోని గాండ్ల తెలికుల దేవతెలికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సంబంధిత కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ ఎస్.భవానీప్రియ చెప్పారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని సంఘం సమావేశానికి హాజరయ్యారు. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ భవానీ ప్రియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ గాండ్ల తెలికులస్తులకు అందుతున్నాయని చెప్పారు. ఇంకా తమ సామాజిక వర్గానికి చెందిన వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ఉద్దేశంతో జిల్లా పర్యటనలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటు తనాన్ని గుర్తించిన సిఎం జగనన్న తెలినేస్తం పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. దీని ద్వారా తమ కులస్తులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని చెప్పారు. అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో సామాజిక భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. సబ్సిడీతో కరెంట్ గానుగలు మంజూరు చేయాలని, వాటికి సబ్సిడీ విద్యుత్ అందించాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద రాష్ట్రంలో 30శాతం సబ్సిడీతో సుమారు 300మందికి ఉపాధి కల్పన యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10, 20శాతం సబ్సిడీతో ఆ కులస్తులకు ఉపాధి యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం, గౌరవాధ్యక్షులు హరగోపాల్ పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

పాలకొండ రూరల్ : నగర పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ బాలుర హైస్కూల్లో శనివారం సరస్వతి విగ్రహాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ గురుబిల్లి రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సరస్వతీదేవి విగ్రహం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేయడం ద్వారా అనేక మంది విద్యార్థిని, విద్యార్థులకు జ్ఞానోదయాన్ని కలగజేయడానికి, విద్య పట్ల ఆసక్తి చూపించడానికి, క్రమశిక్షణ కలిగి నడుచుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, వార్డు కౌన్సిలర్ గంగు నాయుడు, రిటైర్డ్ ఉద్యోగులు గోవిందరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని నవగాం సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాథులు శనివారం సందర్శించారు. రికార్డులతో పాటు సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అవలంగిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, పంచాయతీల్లో వేతన బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా పంచాయతీలే వేతనాలు చెల్లించాలనే ఆదేశాల్ని రద్దు చేయాలని అన్నారు. ఇప్పటి వరకు ఉన్న మొత్తం బకాయిలు వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేయాలని, యూనిఫామ్ సరఫరా చేయాలని, స్వచ్ఛభారత్, గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ ప్రచారార్భాటాల పరిమితం కాకుండా అంబాసిడర్ల సమస్యలు పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు పాలకొండ మండల సమన్వయ కార్యదర్శి కాద రాము, గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్ పాలకొండ మండలం కమిటీ అధ్యక్షులు ఎన్.గురువులు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకర్రావు, ఉపాధ్యక్షులు బి.రవి, కార్యదర్శి ఎం.వైకుంఠరావు, కార్యవర్గ సభ్యులు జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సేవలు అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా ప్రజలకు ఆర్‌టిసి సేవలను సక్రమంగా అందివ్వాలని జనసేన నాయకులు గొర్లి చంటి, వంగల దాలినాయుడు అన్నారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సంబంధిత అధికారితో ఆ పార్టీ నాయకులు ఆర్‌టిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్‌టిసి సేవలు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్వతీపురం నుండి విశాఖ, విజయనగరం రాకపోకలు సాగించేందుకు అవసరమైన బస్ సర్వీసులు నడపాలన్నారు. ఉన్న డొక్కు బస్సులకు లగ్జరీ పేరుతో దోపిడీ చేస్తున్నారని, జిల్లాలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్న డొక్కు బస్సులు ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి అని, తరచూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తించాలని మెకానిక్స్ లేక నిర్వహణ లోపంతో ఆర్‌టిసిని దీన స్థితికి చేర్చారన్నారు. సిబ్బందికి ఆరు నెలలుగా ఒటిలు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కార్యాలయ అధికారి జి. త్రినాధ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్ పాల్గొన్నారు.

వినతినిస్తున్న జనసేన నాయకులు

అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తిబి పార్వతీపురం రూరల్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశ్యంతో పటిష్టమైన సచివాల య వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పులిగిమ్మి గ్రామంలో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలుసుకొని ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావు లేకుండా తమ ప్రభుత్వం లబ్ధిదారు ఖాతాల్లోకి సంక్షేమ పథకాల సొమ్మును వేస్తుందని అన్నారు.

శ్రీసూర్య పీఠంలో ఘనంగా రథసప్తమి వేడుకలు

రథసప్తమిలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్ : రథసప్తమిని పురస్కరించుకొని పట్టణ శివారులో గల సూర్యపీఠంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. పీఠంలో శనివారం ఉదయం 5 గంటల నుంచి పెద్దఎత్తున భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సూర్యపీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ వేమకోటి నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన సూర్య జయంతి వేడుకలు ప్రాతః కాలార్చిన, క్షీరాభిషేకాలు ప్రత్యేక పూజలు భక్తులతో చేయించారు. ఉదయం 10 గంటలకు ఉషా, పద్మినిఛాయ సమేత శ్రీ సూర్య భగవానుని కళ్యాణ్ మహోత్సవం భక్తుల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణతో పాటు శ్రీ సత్యసాయి సేవ కమిటీ సభ్యుల భజన జరిగింది. యోగా సెంటర్ నిర్వాహకులకు నరహరిశాస్త్రితో పాటు హిందీ మాస్టారు మంచిపల్లి శ్రీరాములు సత్కరించారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBNUNAL CUM IV ADDITIONAL DISTRICT JUDGE (SC ST COURT), VIZIANAGARAM
M.O.P.168/2021

Between:
Pasi Ramarao and others ...Petitioners
And:
Pasi Srinu and others...Respondents
R2 :- Unukari Velangini, W/o. Eswara Rao, aged about 41 years, Hindu, Owner of Auto bearing No: AP-35-Y-2749, Resident of SC Colony, Mosuru Village, Pachipenta Mandal, Vizianagaram District (Parvathipuram Manyam Dist.,).

NOTICE

Please taken notice that the above O.P. stands posted to **20-02-2023** for notice to 2nd respondent. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above said court.

If you fail to appear on the said date, the above matter will be decided expartee.

P.A.N.RAJU
Advocate for the Petitioner
Vizianagaram.

లైసెన్స్ లేని ముద్దాయికి జైలు

కురుపాం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో పెండింగ్ ఉన్న కేసులో ముద్దాయి అయిన బూర్జమానుగూడకు చెందిన బిడ్డిక శ్రీను యాక్సిడెంట్ కేసులో డ్రైవింగ్ లైసెన్స్ లేనందున స్థానిక జుడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈ.ఆంజనేయులు శుక్రవారం ముద్దాయికి వారం రోజుల పాటు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. ఒక వేళ జరిమాను కట్టని యెడల మరో రెండు రోజులు జైలు శిక్ష విధించారు. ప్రాసుక్యూషన్ తరపున ఎపిపి కిమిడి చంద్రకుమార్‌వాదించారు

పూరిల్లు దగ్ధం

నెల్లిమర్ల : నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిళ్లు దగ్ధమై రూ. 2లక్షలు ఆస్థి నష్టం జరిగింది. జరజాపుపేట 18వ, వార్డు కొండల వీధిలో కొండల ప్రభావతి పురింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టివి, 1తులం బంగారం, 50 తులాల వెండి, ద్విచక్ర వాహనం, ఇంటి నిత్యావసర వస్తువులు, వంట సమాను కాలిపోయి కట్టు బట్టలతో కుటుంబ సభ్యులు మిగిలిపోయారు. కాగా అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు, యువకులు అగ్ని మాపక శాఖకు సమాచారం అందించి మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. వార్డు కన్వీనర్ నల్లి శ్రీను, మహిళా పోలీసు శాంభవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పాలకొండ: స్థానిక ఎస్‌బిఐ ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండవీదికి చెందిన శ్రావణ్ (24) మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. నగర పంచాయతీ వాటర్ ట్యాంక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య ప్రవల్లిక , రెండు సంవత్సరాల కుమార్తె ఉంది.

నేరాలు ఘోరాలు

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

పార్వతీపురం రూరల్: సీతానగరం మండలం జోగంపేట హైవేపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరు పార్వతీపురం పట్టణానికి చెందిన గుడుపూరు అప్పలనాయుడు కాగా, మరొకరు సీతానగరం మండలం పనుకుపేట గ్రామానికి చెందిన బైరిపూడి సోమనాయుడుగా గుర్తించారు. క్షతగాత్రులను 108 వాహనంలో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.